క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



ఇంటి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

గంగాధర: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీడీవో రాము అన్నారు. మండలంలోని ఇస్లాంపూర్, వెంకటరాయిపల్లి, కాచిరెడ్డిపల్లి, చర్లపల్లి(ఎన్), వెంకంపల్లి గ్రామాల్లో బుధవారం పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. ఎంపీడీవో వెంట ఎంపీవో గౌరి రమేశ్, పంచాయితీ కార్యదర్శులు ఉన్నారు.

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్‌లో వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట ఆడారు. గ్రామంలోని భీమన్న గజాలకు పూజలు చేశారు. అనంతరం గుట్ట వద్ద వరదపాశం నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయానికి విరాళం అందజేత

రామడుగు: మండలకేంద్రంలోని శ్రీ మడేలేశ్వర స్వామి ఆలయాల్లో నిర్వహించే ఉత్సవాలకు గ్రామానికి చెందిన ఎన్నారై తోట సత్యం వారి తల్లిదండ్రులు తోట బుచ్చమ్మ-వెంకయ్య జ్ఞాపకార్థం రూ. 20వేలు విరాళంగా గ్రామస్తుల ద్వారా ఉత్సవాల నిర్వాహకులకు బుధవారం అందజేశారు. ఉత్సవాల నిర్వాహకులు ఎడవెల్లి అంజయ్య, ఎడవెల్లి రాజేశం, ఎడవెల్లి మల్లయ్య, రాగం లక్ష్మణ్, జమ్మికుంట లచ్చయ్యతో పాటు తోట సత్యం ప్రతినిధి రామడుగు అశోక్ పాల్గొన్నారు.

జనసమితి జిల్లా అధికార ప్రతినిధిగా భానుబాబు



చిట్యాల భానుబాబు

చిగురుమామిడి: మండలానికి చెందిన చిట్యాల భానుబాబును జనసమితి జిల్లా అధికార ప్రతినిధిగా నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మోరె గణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఆయన నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

సహకార సంఘం పాలకవర్గ సమావేశం

సైదాపూర్: వెన్కెపల్లి విశాల సహకార సంఘం పాలకవర్గం అత్యవసర సమావేశం బుధవారం చైర్మన్ తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగింది. గత యాసంగి సీజన్‌లో వెన్కెపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవకతవకలు జరిగినట్లు రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు సమావేశంలో చర్చించారు. ఏసీఈవోగా పని చేస్తున్న ఈరాల బిక్షపతి ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడ్డాడని సమావేశంలో తీర్మానం చేశారు. జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపించి, నిర్ణయం తీసుకోవాలని చేసిన తీర్మానం డీసీవోకు పంపించనున్నట్లు నిర్ణయించారు. సీఈవో శ్రీధర్ సక్రమంగా విధులు నిర్వహించడంలేదని డైరెక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో డైరెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

మొరాయించిన ఎలక్ట్రిక్ బస్సు



తాడికల్ శివారులో సాంకేతిక సమస్యతో నిలిచిపోయిన ఎలక్ట్రిక్ బస్సు

శంకరపట్నం: సాంకేతిక సమస్య కారణంగా ఎలక్ట్రిక్ బస్సు రెండురోజులుగా రోడ్డుపైనే ఆగిఉంది. శంకరపట్నం మండలం తాడికల్ శివారులో వరంగల్ డిపోకు చెందిన బస్సు మంగళవారం నుంచి అక్కడే ఉంది. మెకానిక్‌లు మరమ్మతులు చేస్తున్నా ఫలితం ఉండడంలేదు.

పండ్ల మొక్కలు నాటిన సిబ్బంది

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్‌లోని వివిధ రహదారులకు ఇరువైపులా, ఇతర ప్రదేశాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో బుధవారం పండ్ల మొక్కలు నాటినట్లు గ్రామ కార్యదర్శి రాజేశ్ తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల కోసం మంత్రికి విజ్ఞప్తి

గన్నేరువరం: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను బుధవారం మండల కేంద్రం గన్నేరువరానికి చెందిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి మున్నూరుకాపు పటేల్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు బాలయ్య అధ్వర్యంలో ఆ సంఘం నాయకులు కలిశారు. అసంపూర్తిగా ఉన్న సంఘం భవనం, కంపౌండ్ నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేయాలని, గ్రామంలోని 200 మున్నూరుకాపు కుటుంబాలకు సహాయ సహకారాలు అందించాలని వినతిపత్రం అందించారు. సంఘం ఉపాధ్యక్షుడు పుల్లెల రాము, నాయకులు పుల్లెల జగన్ మోహన్ ఉన్నారు.



బోనాల వేడుకలో పాల్గొన్న విద్యార్థులు



బోనాలు సమర్పించిన నాయకులు, భక్తులు

బోనాల వేడుక

హుజూరాబాద్: కాకతీయ కాలనీలోని ఎస్ఆర్ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీలో బుధవారం బోనాల వేడుక ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బోనాలతో పట్టణ పురవీదుల్లో ఊరేగింపు నిర్వహించారు. వేడుకకు ముఖ్య అతిథులుగా కాకతీయ కళాశాల, మిలీనియం స్కూల్ చైర్మన్లు వేణుమాధవ్, తిరుపతిరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అనూశ్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్నకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆషాఢమాసం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పోతరాజుల వేషధారణలో అలరించగా, విద్యార్థినులు బోనాలతో ర్యాలీగా ఎల్లమ్మ గుడివద్దకు వెళ్లి నైవేద్యం సమర్పించారు. అనంతరం గోరింటాకు ఉత్సవం జరిపారు. హెచ్ఎం శ్రీనివాస దీక్షిత్, ఉపాధ్యాయులు లక్ష్మణ్‌కుమార్, కె.రాజమౌళి, హరిత, ఉమారాణి పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని శ్రీమడేలేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రజక సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ నిర్వహించారు. రజక కుటుంబసభ్యులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రజక సంఘం అధ్యక్షుడు సదానందం, మున్సిపల్ పరిధి రామన్నపల్లి అధ్యక్షుడు శ్రీనివాస్, సంపత్, రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న పంజాల శ్రీనివాస్

చిగురుమామిడి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం ఇందుర్తి, చిగురుమామిడిలో వేర్వేరుగా నిర్వహించిన ఎంపీటీసీ స్థానాల పరిధిలోని సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలుండగా మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవాలన్నారు. ఇందుకు కార్యకర్తలు శ్రమించాలన్నారు. మండల సీపీఐ కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్‌రెడ్డి, అందె చిన్నస్వామి, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, బూడిద సదాశివ, రైతు సంఘం నాయకులు, మాజీ సర్పంచులు కోమటిరెడ్డి జయ్‌పాల్‌రెడ్డి, గోలి బాపురెడ్డి, నాయకులు ఎండీ ఉస్మాన్‌పాషా, అల్లెపు జంపయ్య, మావురపు రాజు, కయ్యం తిరుపతితో, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణ క్లీన్



ట్రాక్టర్‌తో చదును చేయిస్తున్న అధికారులు

సాక్షి స్పందన

ఇల్లందకుంట: ఇల్లందకుంట ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం క్లీన్‌చేశారు. పాఠశాలల ఆవరణ అంతా అధ్వానంగా ఉందని.. పారిశుద్ధ్యం కొరవడిందని 'సాక్షి'లో ఈనెల 15న ప్రచురితమైన కథనంపై ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో రాజేశ్వర్‌రావు స్పందించి ఈ చర్యలు తీసుకున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మవారి కుంటలో అక్రమంగా మట్టితో చదును



ధర్మారం అమ్మవారికుంటలో చదును చేసిన స్థలం

శంకరపట్నం: మండలంలోని ధర్మారం గ్రామ శివారులోని అమ్మవారి కుంటలో ఓ రైతు ట్రాక్టర్‌తో అక్రమంగా చదును చేశారని ఆయకట్టు రైతులు ఆరోపించారు. అమ్మవారి కుంటలో సర్వే చేస్తే తనకు కొంత భూమి వచ్చిందని సదరు రైతు బుధవారం ట్రాక్టర్ చదును చేస్తుండడంతో పంచాయతీ కార్యదర్శికి ఆయకట్టు రైతులు సమాచారం అందించారు. కార్యదర్శి ప్రతాప్ వెళ్లి పరిశీలించారు. సర్వే రిపోర్టు అందుబాటులో లేదని మరుసటి రోజు ఇస్తానని కార్యదర్శికి సదరు రైతు తెలిపారు. కాగా చెరువులు, కుంటలో పట్టా భూమి ఉన్నా ఆక్రమించుకోవద్దని, చదును చేయడంతో వరదతో దిగువన పంటభూములు కోతకు గురవుతాయని ఆయకట్టు రైతులు అన్నారు.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జి కోసం వినతి



మేనేజర్ గుప్తాకు వినతిపత్రం ఇస్తున్న కృష్ణారెడ్డి

జమ్మికుంట: జమ్మికుంట రైల్వేస్టేషన్‌ను సౌత్ సెంట్రల్ రైల్వే అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్ గుప్తా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి బుధవారం సందర్శించారు. జమ్మికుంట రైల్వేస్టేషన్ అభివృద్ధి, సమస్యలపై జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి డీఎంకు వినతి పత్రం అందజేశారు. రైల్వేస్టేషన్‌లో జమ్మికుంట, కొత్తపల్లి ఫుట్ ఓవర్ బ్రిడ్జి స్థలాన్ని పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాని మేనేజర్ గుప్తా తెలిపారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రైల్వేఅధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారని, ఉప్పల్ రైల్వే ఫ్లైఓవర్ త్వరలో పూర్తి అవుతుందని తెలిపారు.

'నీళ్లు ఉండి ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం'

కరీంనగర్: నీళ్లు ఉండి ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. బుధవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసి విలేకరులతో మాట్లాడారు. రైతుల పంటలు ఎండిపోతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని మండిపడ్డారు. 98 వేల క్యూసెక్కుల నీళ్లు వృథా పోతున్నాయని, 22 వేల క్యూసెక్కుల నీళ్లు తీసుకుంటే సరిపోతుందని అన్నారు. ఎస్సారెస్పీకి నీరు రాకపోయినా నీళ్లు ఇచ్చే అవకాశం ఉందని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో నిరంతర విద్యుత్ ఉందని, ప్రస్తుతం లోఓల్టేజీతో మోటార్లు కాలిపోతుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మళ్లీ చెప్పులు, ఆధార్‌కార్డులు పెట్టి ఎరువుల కోసం లైన్‌లో నిలబడే రోజులు తెచ్చారన్నారు. సముద్రంలో కలుస్తున్న నీళ్లను తీసుకొని వచ్చి చెరువులు, కుంటలు నింపాలని డిమాండ్ చేశారు. రైతులను పట్టించుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యుత్ అధికారుల పొలంబాట

తిమ్మాపూర్: అలుగునూర్ ట్రాన్స్ కో పరిధిలోని మల్లాపూర్ గ్రామంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో అధికారులు బుధవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా టెక్నికల్ సేఫ్టీ ఆఫీసర్, డీఈ ఉపేందర్, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ వీరాచారి గ్రామ రైతులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా డీఈ ఉపేందర్ మాట్లాడుతూ రైతులకు విద్యుత్ సమస్యలు వచ్చినప్పుడు సొంతంగా మరమ్మతులు చేయవద్దని సూచించారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో జీవకోటికి మేలు

సైదాపూర్: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో జీవకోటికి మేలు చేస్తుందని జమ్మికుంట కేవీకే ప్రధాన శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని గొడిశాలలో బుధవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు. రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి సిద్ధంగా తయారు చేసుకున్న ఎరువులను వాడుకుంటే భూమిలో ఉన్న సూక్ష్మజీవులకు హాని జరగదని అన్నారు. శాస్త్రవేత్తలు విజయ్, హుస్సేన్, ఏవో వైదేహి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వైఖరితోనే అప్పులపాలు

గంగాధర: సర్పంచులకు బిల్లులు చెల్లించే విషయంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానాలవల్లే అప్పుల ఊబిలో కూరుకుపోయారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి మాజీ సర్పంచ్ విజయలక్ష్మి కుటుంబం అప్పుల పాలు కాగా, ఆమె భర్త రవి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని బుధవారం పరామర్శించారు. చికిత్సకు అయ్యే ఖర్చును భరిస్తానని, మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వర్గాలకు సూచించాడు.

నేడు సన్నాహక సమావేశం

గంగాధర: కరీంనగర్‌లోని కళాభారతిలో గురువారం వికలాంగుల మహాగర్జన సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు వికలాంగుల సంఘం మండల అధ్యక్షుడు గంగాదర యాదయ్య అన్నారు.

క్రిస్టియన్ అసోసియేషన్ కార్యవర్గం

గంగాధర: యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ మండల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.సురేశ్, ఉపాధ్యక్షుడిగా అజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా దయాకర్ ఎన్నికయ్యారు.

బియ్యం అందజేత

గన్నేరువరం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చీమలకుంటపల్లికి చెందిన బామండ్ల నరేశ్ కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. 50కిలోల బియ్యం అందజేశారు.

విద్యుత్‌మోటార్ల వైర్లు, ఫ్యూజులు చోరీ

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో వ్యవసాయబావుల విద్యుత్ మోటార్ల ఫ్యూజులు, వైర్లు చోరీకి గురైనట్లు బాధిత రైతులు తెలిపారు. మండలంలోని కేశవపట్నం వాగు పక్కన చెన్నవేని మల్లేశ్, కుమార్‌కు ఆరెకరాల వ్యవసాయభూమి ఉంది. ఇద్దరు అన్నదమ్ములకు వాగు పక్కన వ్యవసాయ బావి ఉంది. ఈ బావికి వేర్వేరుగా వ్యవసాయ మోటార్లు ఉన్నాయి. బుధవారం తెల్లవారుజామున వ్యవసాయబావి వద్దకు వెళ్లగా స్టార్టర్ డబ్బా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. స్టార్టర్ నుంచి మోటార్ వరకు ఉండే వైర్‌ను, పైపును కట్ చేసిన దొంగలు ఫ్యూజులు, వైర్‌ను తీసుకెళ్లారు. వీరిద్దరితో పాటు గ్రామంలో మరో ముగ్గురి రైతుల ఫ్యూజులు, వైర్లు చోరీకి గురయ్యాయని రైతులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రామడుగు: రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఇనుగుర్తి గంగాచారి (45) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం రాత్రి ఇనుగుర్తి గంగాచారి ద్విచక్రవాహనంపై కరీంనగర్ నుంచి గోపాల్‌రావుపేటకు వస్తుండగా గుండి విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద వాహనానికి కుక్క అడ్డు రావడంతో కిందపడ్డాడు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆయనను 108లో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

నేటి సభ సక్సెస్ చేయాలి

చొప్పదండి: కరీంనగర్ కళాభారతిలో గురువారం నిర్వహిస్తున్న మంద కృష్ణ మాదిగ సభను విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు వెల్మ బాపురెడ్డి, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ శంకర్ కోరారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, వికలాంగులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు.

కాటమయ్య కిట్ల పంపిణీ

జమ్మికుంట రూరల్: మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామ శివారులో గౌడ్ కులస్తుల మండపంలో ఎక్సైజ్ శాఖ, జమ్మికుంట మండల గౌడ్ సంఘం అధ్యక్షుడు పూదరి విజయ్‌గౌడ్ ఆధ్వర్యంలో కాటమయ్య కిట్లను 55మందికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు పూదరి శ్రీనివాస్‌గౌడ్, గట్టు శ్రీనివాస్‌గౌడ్, కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

హోటళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు

శంకరపట్నం: మొలంగూర్‌క్రాస్ రోడ్డు వద్ద హోటళ్లలో బుధవారం సీసీ కెమెరాలను ఎస్సై శేఖర్‌రెడ్డి ఏర్పాటు చేయించారు. గతంలో మొలంగూర్ క్రాస్‌రోడ్డులోని హోటళ్లలో దొంగతనాలు జరిగిన దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని హోటల్ యజమానులకు సూచించడంతో కొంత మంది సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు.

చిగురుమామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శశిధర్‌శర్మ

చిగురుమామిడి: చిగురుమామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శశిధర్‌శర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్, సిద్దిపేట జిల్లాల ఇంటర్ విద్యాధికారులు గంగాధర్, రవీందర్‌రెడ్డి, ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్ మహేందర్‌లతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

జమ్మికుంటరూరల్: మండలంలోని కోరపల్లి గ్రామంలో బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్తికేయ ఆసుపత్రి వైద్యులు ముక్కా శరత్ బాబు, ముక్కా మౌనిక సౌజన్యంతో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.

గోదాం అద్దె డబ్బులు వసూలు చేయాలి

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన గోదాంలో ధాన్యం బస్తాలు వేస్తున్న వ్యాపారి నుంచి అద్దె డబ్బులు వసూలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ బుధవారం తహసీల్దార్ సురేఖకు వినతిపత్రం అందజేశారు.

నేడు సైకిళ్ల పంపిణీ

హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో ప్రధాని మోదీ కానుకగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం సైకిళ్లను పంపిణీ చేయనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం సైకిల్ పంపిణీ చేసే ప్రదేశం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ స్వయంగా వివిధ సంస్థల నుంచి సేకరించిన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్సార్) నిధులతో ఈ సైకిళ్లను కొనుగోలు చేసి పేద విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో దాదాపు 25వేల సైకిళ్లను పంపిణీ చేశారన్నారు. బోయినపల్లి ప్రవీణ్‌రావు, మాడ వెంకట్ రెడ్డి, నరసింహరాజు, రాముల కుమార్, తూర్పాటి రాజు, సంపెల్లి సంపత్ రావు, ఆకుల రాజేందర్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

చొప్పదండి: చొప్పదండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతిలో అడ్మిషన్ తీసుకున్న భూపాలపట్నం గ్రామానికి చెందిన కె.అనువర్షకు డబ్ల్యూడీడబ్ల్యూఎస్ సంస్థ సహకారంతో బుధవారం సైకిల్ అందజేశారు. బాలుర ఉన్నత పాఠశాలలో దూర ప్రాంతాల నుంచి వస్తున్న 40 మందికి ఇప్పటికే సైకిళ్లు అందజేశారు. ఈ విద్యా సంవత్సరం బాలుర ఉన్నత పాఠశాలలో చేరిన 20 మందికి కూడా సైకిళ్లు ఇవ్వనున్నట్లు సంస్థ కార్యదర్శి జమున హామీ ఇచ్చారని హెచ్ఎం వైద్యుల రాజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కె.కృష్ణ, కె.సమత, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

సైదాపూర్: మండలంలోని సోమారంలో దాసారపు సదానందం మంగళవారం రాత్రి తాటిచెట్టుపై నుంచి జారిపడి గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు. హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడని అన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమించాలి



మాట్లాడుతున్న మిల్కూరి వాసుదేవారెడ్డి

హుజూరాబాద్ : ప్రజలు స్థానిక సమస్యలపై ఉద్యమించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో మండల కమిటీ సమావేశం కామ్రెడ్ కదిరే రమేశ్ అధ్యక్షతన జరిగింది. గ్రామాలు, పట్టణకేంద్రంలో ప్రజలు ఎన్నో సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేవరకు నిరంతర పోరాటం చేయాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. ఇప్పటికే నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను ళ్లను అర్హులకు పంపిణీ చేయాలన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. సమావేశంలో నాయకులు శీలం అశోక్, కొప్పుల శంకర్, దాట్ల రత్నాకర్, రాచపల్లి సారయ్య, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ దారులకు నోటీసులు జారీ చేయండి



మొలంగూర్‌లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేఖ

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌లో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని రేకుల షెడ్లు, పంటలు వేసిన వారికి నోటీసులు జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శి, ఆర్ఐలకు తహసీల్దార్ సురేఖ ఆదేశించారు. మొలంగూర్‌లోని సర్వేనంబర్ 703లో ప్రభుత్వభూమి ఆక్రమణకు గురైందని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు మోరె గణేశ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇటీవల సర్వే చేశారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని రెండో విడత ఇందిరమ్మ పథకంలో ఇంటి స్థలాలు ఇస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు. ఆర్ఐ బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు మోరె గణేశ్, విండో చైర్మన్ పొద్దుటూరి సంజీవరెడ్డి ఉన్నారు.

రిటైర్డు ఉద్యోగులకు సన్మానం



రిటైర్డు ఉద్యోగులను సన్మానిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

హుజూరాబాద్ : పట్టణంలోని సైదాపూర్ రోడ్డులో తెలంగాణ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల రిటైర్డ్ అయిన విజయగిరి చంద్ర సేన, గోగుల శబ్ద ప్రకాశ్‌ను అసోసియేషన్ బాధ్యులు ఘనంగా సత్కారించారు. ఈ సందర్భంగా జిల్లాశాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ మాట్లాడతూ.. ఏప్రిల్ 2024 నుంచి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ, కమ్యూటేషన్ ఎలాంటి పెండింగ్ లేకుండా వెంటనే చెల్లించాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలుచేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు శనిగరం నరేందర్, చీకట్ల సమ్మయ్య, కట్ట నాగభూషణాచారి, బొంగోని వెంకటయ్య, గరిగె చంద్రయ్య తదితరులు ఉన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే ఆరోపణలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

హుజూరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజకీయ లబ్ధికోసం బీజేపీ నాయకులు ప్రభుత్వంపై పసలేని ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదనడం విడ్డూరమన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఎంపీగా ఉన్న సమయంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన విషయాన్ని గుర్తుచేశారు. నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయకుండా కాలయాపన చేస్తుంటే ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు సందమల్ల బాబు,దుబాసి బాబు, బత్తిని రవీందర్ గౌడ్, ముక్క రవితేజ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు సాంస్కృతిక రంగంలో రాణించాలి



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల హెచ్ఎం, డైరెక్టర్, ఉపాధ్యాయులు

హుజూరాబాద్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడా, సాంస్కృతిక తదితర రంగాల్లో రాణించాలని మాంటిస్సోరి పాఠశాల ప్రిన్సిపాల్ గీతాషాజు అన్నారు. పాఠశాలకు చెందిన రెండోతరగతి చదువుతున్న కె.రియాన్షిత ఇటీవల నృత్య ప్రదర్శనలో రాణించి శ్రీనాట్యరవళి-2025 పురస్కారాన్ని అందుకున్నారు. బుధవారం చిన్నారిని ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ షాజూథామస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాల తనిఖీ



జమ్మికుంటలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

జమ్మికుంట/జమ్మికుంటరూరల్/ఇల్లందకుంట/హుజూరాబాద్‌రూరల్: జమ్మికుంట పరిధిలోని కొత్తపల్లి, 1,2 ఆరోగ్య ఉపకేంద్రాలను, మడిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని డీఎంహెచ్‌వో వెంకటరమణ బుధవారం సందర్శించారు. రికార్డులు, రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇల్లందకుంటలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామంలోని ప్రాథమిక ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. మందుల దుకాణం, రోగులకు అందుతున్న సేవల గురించి, ఆసుపత్రి నిర్వహణ గురించి పీహెచ్‌సీ వైద్యుడు మధును అడిగి తెలుసుకున్నారు.

ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో అల్ఫోర్స్ విద్యార్థులకు సీట్లు



విద్యార్థులను సత్కరిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: చక్కటి ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణ ఫలితంగా అల్ఫోర్స్ విద్యా సంస్థల విద్యార్థులు భారతదేశంలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో సీట్లు సాధించారని ఆ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. దేశంలోని అత్యున్నత విద్యాసంస్థల్లో సీట్లు సాధించిన 2022-23 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులను బుధవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈటెక్నో పాఠశాలలో అభినందించి సత్కరించారు. విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే ఐఐటీ, నీట్‌లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో చక్కటి ఫౌండేషన్ ఇవ్వడం జరుగుతోందని అన్నారు. సుమారు 35 మంది విద్యార్థులకు ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీల్లో సీట్లు వచ్చాయని తెలిపారు. భవిష్యత్‌లో కూడా విద్యార్థులకు ఉన్నతమైన విద్య అందించి ఉన్నత స్థానాల్లో నిలుపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.